

మినీ కథ

# కేలండర్ కథ

సీట్లో కూర్చుని సీరియస్‌గా పని చేసుకుంటున్న రాజేశ్వరరావు "ఏమండీ" అన్న పిలుపు విని తల పైకెత్తాడు.

"ఏం కావాలి?" అడిగేడు.

"మంగపతిగారు లేరా?" అన్నాడా వచ్చిన అతను.

మంగపతి రాజేశ్వరరావు కొలీగ్. ఇద్దరూ ఆఫీసులో పక్కపక్కనే కూర్చుంటారు.

మంగపతి సీట్ వైపు చూశాడు రాజేశ్వరరావు. ఖాళీగా ఉంది.

"సెక్షన్ ఆఫీసరు రూములో ఉన్నాడు. ఇద్దరూ కలిసి ఏదో డిస్కషన్ చేస్తున్నారు. ఒక అరగంట దాకా రాడు" అన్నాడు రాజేశ్వరరావు.

"ఆయన వచ్చాక ఇది కొంచెం ఇచ్చేయండి" అంటూ ఒక చిన్న రోల్ ఇచ్చాడు.

"ఏమిటది?" అడిగేడు రాజేశ్వరరావు.

"కేలండర్" అన్నాడు అతను దాన్ని అందిస్తూ.

"ఎవరిచ్చారని చెప్పను?"

"ఏం చెప్పక్కర్లేదు. ఇది ఇస్తే అర్థం అవుతుంది అంతా. వస్తాను. నమస్తే ..." అంటూ వెళ్ళిపోయాడు.

రబ్బర్ బ్యాండ్ తొలగించి విప్పి చూశాడు. మంగపతి దగ్గర గతంలో తను చూసిందే. చాలా మంచి క్యాలెండర్. పేజీకి రెండు నెలల చొప్పున ఆరు పేజీలతో ఆరు రకాల జంతువుల కలర్ ఫొటోలతో ఉన్నది. చూడగానే సొంతం చేసుకోవాలనిపించే కేలండర్. మంగపతికి ఒక ప్రెస్సు వాడు బాగా తెలుసు. గతంలో ఇలాంటి దొకటి ఇచ్చాడు కూడా. ఇప్పుడు ఇంకోటి ఎందుకో?

రాజేశ్వరరావులో అసూయ కలిగింది. కేలండర్‌లో రెండు పేజీల మీద పెన్నుతో బొమ్మల మీద పిచ్చి గీతలు గీశాడు. మరో రెండు పేజీల మీద పెన్నుతో చిల్లులు కొట్టాడు. తనకు లేకుండా వాడికి రెండు కేలండర్లు రావడం భరించలేక పోయాడు. ఏమీ ఎరగనట్లు దాన్ని మళ్ళీ ప్యాక్ చేశాడు.

మరో గంట తర్వాత వచ్చిన మంగపతికి విషయం చెప్పి కేలండర్ రోల్ అందించాడు.

తీసుకోలేదు మంగపతి.

"ఇలాంటిదే నీ కొకటి కావాలని అడిగేవు కదా! అందుకే కబురు పెట్టి తెప్పించాను. అది నీకోసమే. నువ్వు ఉంచుకో" అన్నాడు మంగపతి.

రాజేశ్వరరావు ముఖం మాడిపోయింది.

-'పాలకూర సీతాలత'